క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో చేరడానికి విద్యార్థులు దరఖాస్తులను చేసుకోవాలని కళాశాల పిన్సిపాల్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి గాను నాలుగోవ విడత స్పాట్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రీషియన్ 5, ఫిట్టర్ 15, ఎలక్ట్రానిక్ మెకానిక్ 24, డ్రాఫ్ట్ మెన సివిల్ 23, కోపా 14 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎనిమిది, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సెప్టెంబర్ 20 వరకు చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ ట్రాలీ చోరీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురైంది. పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెలలో మార్కెట్ యార్డు ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ట్రాలీని తీసుకువెళ్లి అక్కడే వదిలిపెట్టినట్లు తెలిపారు. కాగా, ఇటీవల ట్రాక్టర్ ట్రాలీ కోసం వెళ్లి చూడగా లేదన్నారు. దీంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రవీణ్ తెలిపారు.

పారిశుద్ధ్య పనులు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం పంచాయతీలో డబుల్ బెడ్ రూమ్ కాలనీలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీలో చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సాయి ప్రకాశ్ ఆధ్వర్యంలో సభ్యులు సంఘటన ప్రాంతానికి చేరుకుని కాలనీ మొత్తం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో రవుల నరేంద్ర కుమార్, రాధకృష్ణ, నరేష్, రమేశ్ తదితరులు ఉన్నారు.

మంగపేటలో..



మంగపేట: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తునన పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ బానోత్ బద్రు శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు సమయపాలన పాటిస్తు ప్రజలకు అందుబాటులో ఉండాలని గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే మంగపేట బోరునర్సాపురం మధ్య నిర్మించిన మినీ బ్రిడ్జిని, బుచ్చంపేట గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు వయసు తగిన బరువు ఉన్నారా లేరా అని పరీక్షించారు. పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య, పోషక విలువలతో కూడిన బోజనాన్ని అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. ఆయన వెంట మండల పరిషత్ పర్యవేక్షులు ఆలేటి సుదర్శన్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



గోవిందరావుపేట: విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ కిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చల్వాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, మోడల్ పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిజామొద్దిన్, హెచ్ఎం చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్‌లో శుక్రవారం ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు.

నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



వాజేడు: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు శుక్రవారం ఏర్పాట్లు చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న 17 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో శనివారం నుంచి నవరాత్రులను నిర్వహించడానికి మండపాలను సిద్ధం చేస్తున్నారు. ముందస్తుగా పోలీసు శాఖ నుంచి అనుమతులను సైతం తీసుకుంటున్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



ములుగు: మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా



ఏటూరునాగారం: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ప్రేమలత

ములుగు: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా అన్నారు. ములుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి ములుగు ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం, రకతహీనతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లెనినా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భినులకు, బాలింతలకు పోషకాహారం, రక్త హీనతపై అవగాహన కల్పించారు. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ నెల పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శిరీష, సూపర్‌వైజర్ కావ్యతో పాటు తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రేమలత అన్నారు. పోషణ్ అభియాన్ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో సీడీపీఓతో పాటు ఎంపీడీక్ష రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ప్రైవేట్ ఆస్పత్రులను సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలితలకు సూచనలు చేశారు. అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు ఆయా కాలాల్లో లభించే పండ్లు విధిగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పాలు, గుడ్లు, ఒక పూట సంపూర్ణ భోజనం తీసుకోవాలన్నారు. అనంతరం నేతాజీ నగర్ ఎంపీఎస్ పాఠశాలను సందర్శించి బాలికలు, చిన్నారులకు రక్తహీనత వల్ల ఏర్పడే వ్యాధులను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేద్దాం..



ఏటూరునాగారం: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



వెంకటాపురం(కె)లో..

ఏటూరునాగారం: అధికారులు, వినాయక ఉత్సవ కమిటీల ప్రతినిధులు సమన్వయంతో వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేద్దామని సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ జి.జగదీశ్వర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, మండల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిబంధనల మేరకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపాలు, ఉత్సవాల నిర్వహణ జరపాలని, ప్రజలకు, భక్తులకు ఎక్కడా కూడా ఆటంకం కలుగుకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎండీ తాజుద్దీన్, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ రమేశ్, అగ్రికల్చర్ ఆఫీసర్ వేణుగోపాల్, మెడికల్ ఆఫీసర్ సుమలత, విద్యుత్ ఏఈ బి.అశోక్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ కిరణ్, జూనియర్ అసిస్టెంట్ శంకర్ గ్రామ పెద్దలు ఈర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, వికాస్, రియాజ్ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినాయక ఉత్సవాల నిర్వహణపై మండల అధికారులుతో తహసీల్దార్ రాజయ్య సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వినయ చవితి మండపాలకు, మైక్‌ల ఏర్పాట్లకు అనుమతులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని చర్చించారు. వినాయ నిమర్జన కార్యక్రమం పాత్రాపురం సమీపంలోని బల్లకట్టు వాగు వద్ద చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎస్సై తిరుపతిరావు, ప్రవీణ్ ఉన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ అభినందనీయం



మట్టి విగ్రహాలను అందజేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

ములుగు: మట్టి విగ్రహాల పంపిణీ అభినందనీయమని కలెక్టర్ దివాకర అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యశాఖ అధికారి అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ మహేందర్‌కు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. మట్టి గణపతులను పూజించడం వల్ల పర్యవరణాన్ని పరిరక్షించడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించడం జరుగుతుందని అన్నారు. ప్రజలు అందరు మట్టి విగ్రహలను పూజించి గణపతి ఆశీస్సులను అందుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి చేంచ రమేష్, రాజి రెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే పలు పాఠశాలల్లో విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మంగపేట: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున

మంగపేట: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. మండలంలోని రమణక్కపేట పంచాయతీ పరిధిలోని విజయరావుపేట, వెంకటగిరిపేట ప్రాంతాల్లో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్య శిబిరంలో హెచ్‌వి పద్మ, ఏఎన్ఎం సీతమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 25 మంది 15 రోజులకు పైబడి దగ్గు, తెమడతో బాధపడుతున్నట్లుగా గుర్తించి వారందరికీ తెమడ పరీక్షలు చేశారు.

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ పరిధిలోని రాజుపేట ఉప్పరకాలని, తిమ్మాపురంలో వైద్యాధికారి నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల ఏఎన్ఎంలు అరుణ, సీతారావమ్మ, సింధూజతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వీరాపురం, ఇప్పలగూడెం, నాయకుల గూడెం, నూగూరు గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహ, పవన్, ఆశీష్, వినయ్, సోహెల్ సిబ్బంది మనోహన్ ,జ్యోతి తదితరులు ఉన్నారు.



వెంకటాపురం(కె)లో..



కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: మండలంలోని దేవాదుల,ఏటూరు,భూపతిపురం గొత్తకోయ, బంగారుపల్లి, గ్రామాల్లో స్థానిక వైద్యుడు అభినవ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉషారాణి, ఎంసీహెచ్ డాక్టర్ గిరి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఇంటింటా ఫివర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఏఎన్ఎంలు, కవిత, మంజువాణి, ఊర్మిల పాల్గొన్నారు

జాతీయ సెలవుగా ప్రకటించాలి



రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి15ను జాతీయ సెలవు రోజుగా ప్రకటించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సేవాలాల్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఎంపీ రాజేందర్‌కు సేవాలాల్ ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికి సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని అందజేశారు. సేవాలాల్ జయంతిలో బంజారా కులస్తులు, కుల పెద్దలు ఉద్యోగుల కుటుంబాలు పాల్గొంటామని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎంపీ స్పందించి సెలవు దినంగా ప్రకటించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా అధ్యక్షుడు పోరిక సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి కుమార్ పాండ్య, గౌరవ అధ్యక్షుడు పాల్తీయా సారయ్య, మాజీ పార్లమెంట్ సభ్యుడు సీతరామ్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్, కార్యదర్శి భూక్య సర్ధార్, అంగోత్ వినాయక్, లంబాగ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పోరిక అశోక్ నాయక్, అడ్వకేట్ బాన స్వామి, దాస్ పోరిక చంటి, పాండ్య పోరిక పవన్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ రాజేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన పుట్ట మహేష్ ఇటీవల పిడుగు పడి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం చేయలేదని మృతుడి కుటుంబ సభ్యులు ఎంపీ రాజేందర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణ ఆర్థిక సాయం ఎందుకు అందించలేదని రెవెన్యూ కలెక్టర్‌ను అడిగారు. వారి కుటుంబంలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిగొండ బలరాం, జిల్లా ప్రధాన కార్యదర్శులు భర్తపురం నరేష్, రవింద్రచారి, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లురి లక్ష్మణ్, సభ్యత్వ నమోదు కన్వీనర్ డ్యాగల సలేందర్, నాయకులు సిద్ధబోయిన సురేందర్, జంగా హన్మంతరెడ్డి, మాదరి శ్రీకాంత్, శుభాష్, గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సంధ్యరాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ లక్ష్మిరాజయ్యకు గొండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు అక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. గిరిజనేతరులు ప్రభుత్వ భూముల క్రయ విక్రయాలు నిలుపివేయాలని తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ నాయకులు

ఏటూరునాగారం: ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆలం కిషోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ.. సమాజంలో ఆదివాసీలు అనేక రకాల దోపిడీలకు గురవుతున్నారన్నారు. నిందితుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా తక్షణమే కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిసే బాలకృష్ణ, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దబ్బాగట్ల శ్రీకాంత్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గావిడి నాగబాబు, ఆదివాసీ మహిళా సంఘం గౌరవ అధ్యక్షుడు బడే సులోచన, ఈసం స్వరూప, బొల్లెం సారయ్య, పాయం భారతమ్మ, జాకా సమ్మక్క, చంద్రమని, గుంటి సరోజన, పలక ముత్తమ్మ, సోయం రత్న ఆర్కే సుభద్ర, దుగిని ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం..



వాజేడులో మట్టి విగ్రహాన్ని చూపిస్తున్న విద్యార్థులు



ములుగులో తయారు చేసిన మట్టి విగ్రహంతో విద్యార్థినులు

వాజేడు: మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎంపీపీఎస్ నాగారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజి అన్నారు. మండల పరిధిలోని నాగారం ఎంపీపీఎస్ పాఠశాల, వాజేడు ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం మట్టి విగ్రహాలను తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉపాధ్యాయులతో విద్యార్థులు మట్టితో వినాయకుడి విగ్రహాలను తయారు చేయించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం ప్రతీ ఒక్కరం మట్టి విగ్రహాలను వాడాలన్నారు. రసాయనిక విగ్రహాల మూలంగా వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అందరం మట్టి విగ్రహాలను పూజిద్దామని తెలిపారు.

బొల్లారం చెరువుకు బుంగ



బుంగను పరిశీలిస్తున్న అధికారులు

వాజేడు: మండల పరిధిలోని బొల్లారం చెరువుకు శుక్రవారం బుంగ పడింది. బుంగ పడిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు డీటీ రాహుల్ చంద్ర వర్మ, ఆర్ఐ కుమారస్వామిలతో కలిసి అక్కడికి వెళ్లి పరిశీలించారు. వారు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇరిగేషన్ అధికారులతో వెంటనే మరమ్మత్తులు చేయించాలని ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని తహసీల్దార్‌కు సూచించినట్లు తెలిసింది.

రహదారిపై తగ్గిన వరద



వరద తగ్గడంతో తెలిన రహదారి

వాజేడు: గోదావరి వరద మూలంగా ముంపునకు గురైన 163 నంబర్ జాతీయ రహదారిపై గోదావరి వరద తగ్గింది. రహదారిపైకి చేరిన వరద నీరు పూర్తిగా తొలగిపోయింది. వారం రోజులుగా ఎలాంటి రాక పోకలు నిలిచి శుక్రవారం నుంచి ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య రాక పోకలు కొనసాగుతున్నాయి.

సన్మానం



రవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు భూక్య రవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయుడు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని అన్నారు.

ఆర్ఎంపీ వైద్యశాలల తనిఖీ



మందులను పరిశీలిస్తున్న క్రాంతి కుమార్

వాజేడు: మండల పరిధిలోని వాజేడు, పేరూరు వైద్యశాలల పరిధిలోని ఆర్ఎంపీ క్లినిక్‌లతో పాటు, రక్త పరీక్ష కేంద్రాలను డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ క్రాంతి కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, వారు ఇచ్చే మందుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పరిశీలించారు. యాంటిబయోటిక్ మాత్రలు డోస్ ఎక్కువవి ఇవ్వొద్దని హెచ్చరించారు. జ్వరాలతో వచ్చిన రోగుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా నివారణ చర్యలను చేపట్టాలని వైద్య సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట పేరూరు వైద్యాధికారి రాహిల్, కోటిరెడ్డి తదితరులున్నారు.

ఇసుక ర్యాంపు వద్ద లారీ డ్రైవర్ల ధర్నా



ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు ఇసుక ర్యాంపు వద్ద లారీ డ్రైవర్లు ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిపై బైఠాయించి శుక్రవారం ధర్నా చేశారు. దీంతో రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు మాట్లాడుతూ.. ఇసుక లోడింగ్ కోసం డీడీలు తీసుకోని ర్యాంపు వద్దకు వచ్చి నాలుగు రోజులు దాటిందని లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి ర్యాంపులో లారీల్లో ఇసుక లోడింగ్ చేయక పోవటంతో ఇక్కడే ఉండాల్సి వస్తుందని అన్నారు. అధికారులు ఇప్పటికైనా ర్యాంపు వద్ద ఇసుక లోడింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.